



క్రైమ్ THE మిర్రర్®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
శుక్రవారం 7-08-2026 | పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్

# పేదల సంక్షేమమే ధ్యేయం

- ఏదులాపురం, ఖమ్మం రూరల్ మండలాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి
- రూ.21,000 కోట్ల రుణమాఫీతో రైతులకు భరోసా ఇచ్చాం
- అర్హులైన ప్రతి పేదవాడికీ ఇందిరమ్మ ఇల్లు : మంత్రి పొంగులేటి



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:**

పేదల సంక్షేమం, గ్రామాల సమగ్ర అభివృద్ధే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. గురువారం జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్‌లతో కలిసి ఏదులాపురం మున్సిపాలిటీ, ఖమ్మం రూరల్ మండలంలో మంత్రి విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.

మిగతా 2లో

## రామన్నపేట ఆసుపత్రిలో గర్భిణీలకు నరకదర్శనం!

- సేవలు సున్నా... సాకులు వంద!
- అత్యవసర వేళ ప్రాణాలకు పూచీ ఎవరిది?
- వారం రోజుల క్రితం అర్ధరాత్రి వేళ గర్భవతులతో రాక్షసక్రీడ!
- సమయానికి రాని వైద్యులు.. ఎదురు ప్రశ్నిస్తే దుర్భాషలు!
- కలెక్టర్ గారి ఆదేశాలు కాగితాలకే పరిమితమా?.. తక్షణమే తనిఖీ చేయాలని డిమాండ్!




2లో

## చిట్కుల్, జిన్నారం బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఆదర్శ్ రెడ్డి




2లో

# రామన్నపేట ఆసుపత్రిలో గర్భిణీలకు నరకదర్శనం!



**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, ఆగస్టు 06(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలోని రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు, ముఖ్యంగా గర్భిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ దవాఖానకు వస్తే నాణ్యమైన వైద్యం అందుతుందని నమ్మి వచ్చే నిరుపేదలకు ఇక్కడ సిబ్బంది అలసత్వమే ఎదురవుతోంది. బుధవారం, శనివారాల్లో పరీక్షల కోసం వస్తున్న గర్భిణులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది.ఆసుపత్రికి రావాల్సిన సమయానికి డాక్టర్లు రాకపోవడంతో దూరప్రాంతాల నుండి వచ్చిన గర్భిణులు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. ఆలస్యం గురించి ప్రశ్నిస్తే సమయపాలన పాటించని సిబ్బంది గర్భిణులపైనే ఆగ్రహం వ్యక్తం చేస్తూ, వెనక్కి తిప్పి పంపిస్తుండటం విచారకరం.వారం రోజుల క్రితం అర్ధరాత్రి వేళ అత్యవసర పరిస్థితిలో ఐదారుగురు గర్భిణులు ఆసుపత్రికి వెళ్తే, అక్కడ ఉన్న సిబ్బంది కనీస మానవత్వం లేకుండా వారిపై తీవ్రస్థాయిలో దురుసుగా ప్రవర్తించారు. ఎమర్జెన్సీ వైద్యం అందించాల్సింది పోయి, రాత్రి వేళ వారిని నిర్దాక్షిణ్యంగా బయటకు తిప్పి పంపించారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఆసుపత్రిలో స్కానింగ్ చేసే సిబ్బంది బదిలీ కావడం, పూర్తిస్థాయి గైనకాలజిస్ట్ అందుబాటులో లేకపోవడంతో సేవలు పూర్తిగా స్తంభించాయి. ప్రసవ సమయం దగ్గరపడిన వారికి ఆపరేషన్లు చేసే వైద్యులు లేరనే సాకుతో చివరి నిమిషంలో నల్గొండకు వెళ్లాలని సూచిస్తున్నారు. ఎమర్జెన్సీ సమయంలో రామన్నపేట దవాఖానకు వస్తే, ఇక్కడ ఎలాంటి సౌకర్యాలు లేకపోతే తమ పరిస్థితి ఏమిటని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.కలెక్టర్ ఆదేశాల మేరకు ఆసుపత్రిలో వైద్య సేవలు అందాల్సిన చోట సిబ్బంది నిర్లక్ష్యం తాండవిస్తోంది. కనీస వసతులు కల్పించకపోవడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వైద్యాధికారులు, జిల్లా కలెక్టర్ తక్షణమే రామన్నపేట దవాఖానను సందర్శించి, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న బాధ్యులపై చర్యలు తీసుకొని, పూర్తిస్థాయి సేవలను అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

# పేదల సంక్షేమమే ధ్యేయం



టప్రకాష్ నగర్ బ్రిడ్జి నుంచి గుదిమల్ల వరకు రూ.5 కోట్లతో చేపట్టనున్న రహదారి నిర్మాణ పనులకు, కామంచికల్ గ్రామం నుంచి కోయచలక వరకు రూ.2.10 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గత 32 నెలల్లో ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 8, 10, 11, 12 వార్డుల్లో రూ.21.61 కోట్ల నిధులతో అనేక అభివృద్ధి పనులను దిగ్విజయంగా పూర్తి చేశామని తెలిపారు. గత ప్రభుత్వం గ్రామాలు, కొత్త మున్సిపాలిటీలను పూర్తిగా నిర్లక్ష్యం చేసి మౌలిక వసతులు కల్పించడంలో వైఫల్యం చెందిందని విమర్శించారు. కామంచికల్ గ్రామ అభివృద్ధికి గత 32 నెలల్లోనే రూ.5.66 కోట్లు మంజూరు చేశామని, మరో రెండు నూతన రహదారులను కూడా త్వరలోనే మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. రాజకీయాలు, కులమతాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు. తొలి విడతలో 4.5 లక్షలు, రెండో విడతలో 2.5 లక్షలు, హైదరాబాద్‌కు మరో లక్ష కలిపి మొత్తం 8 లక్షల ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని వివరించారు. రాబోయే మూడు, నాలుగు విడతల్లో మరిన్ని ఇళ్లను కేటాయిస్తామని, రెండు మూడు రోజుల్లోనే నూతన మంజూరు ప్రక్రియ ప్రారంభమవుతుందని వెల్లడించారు. రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొంటూ, ఇప్పటివరకు 25 లక్షల మంది రైతులకు రూ. 21,000 కోట్ల రుణమాఫీ పూర్తి చేశామని మంత్రి తెలిపారు. రైతు భరోసా కింద ఎకరానికి రూ. 6,000 చొప్పున జమ చేయడంతో పాటు, సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ అందిస్తున్నామన్నారు. వచ్చే ఆగస్టు 15 నుంచి నూతనంగా వృద్ధాప్య, వితంతు పెన్షన్ల పంపిణీకి శ్రీకారం చుడతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఆర్డీఓ శ్రీనివాస్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు పెద్ద ఎత్తున గ్రామస్థులు పాల్గొన్నారు.





## గుండాల మండల ఫోటోగ్రఫీ యూనియన్ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**అధ్యక్షుడిగా ఎం.డి. సమ్మద్ పాషా ఎన్నిక**

**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో,ఆగస్టు 06(క్రైమ్ మిర్రర్):** గుండాల మండల ఫోటోగ్రఫీ యూనియన్‌కు నూతన నాయకత్వం ఏర్పడింది. మండలంలోని ఫోటోగ్రాఫర్లు నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. వృత్తిపరమైన సమస్యల పరిష్కారం, ఫోటోగ్రాఫర్ల సంక్షేమం, ప్రభుత్వ గుర్తింపు, సంక్షేమ పథకాల అమలు, యువ ఫోటోగ్రాఫర్లకు ప్రోత్సాహం వంటి అంశాలపై సంఘం సమిష్టిగా పోరాటం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన కమిటీలో మండల అధ్యక్షుడిగా ఎం.డి. సమ్మద్ పాషా, ఉపాధ్యక్షుడిగా దుదక దిలీప్, ప్రధాన కార్యదర్శిగా యేలికట్టి మహేష్, కోశాధికారిగా గుగ్గిల్ల సురేష్ ఎన్నికయ్యారు. ముఖ్య సలహాదారులుగా గౌలికర్ యుగంధర్, కొడవర్తి భాస్కర్, ఎలగందుల స్వామి, నారగాని యాదగిరిలను నియమించగా, మండల కుటుంబ భరోసా అధ్యక్షుడిగా మన్నూరి వెంకన్న బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ, ఫోటోగ్రఫీ వృత్తి ఎదుర్కొంటున్న సవాళ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, ప్రతి ఫోటోగ్రాఫర్‌కు న్యాయం జరిగేలా కృషి చేస్తామని ప్రకటించారు. సంఘాన్ని మరింత బలోపేతం చేసి, సభ్యుల ఐక్యతతో హక్కుల సాధన కోసం ముందుండి పోరాడతామని స్పష్టం చేశారు. సమావేశంలో పాల్గొన్న సభ్యులు నూతన కమిటీపై పూర్తి విశ్వాసం వ్యక్తం చేస్తూ, మండలంలోని ఫోటోగ్రాఫర్ల అభ్యున్నతికి ఈ కమిటీ కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. నూతన కమిటీ ఎన్నికతో మండల ఫోటోగ్రాఫర్లలో కొత్త ఉత్సాహం నెలకొంది.

## చిట్కుల్, జిన్నారం బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఆదర్శ్ రెడ్డి

**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 06:** పటాన్‌చెరు నియోజకవర్గం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్ గ్రామంలో నిర్వహించిన ఆషాఢ బోనాల మహోత్సవంలో పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్, ఇస్నాపూర్ మున్సిపల్ కౌన్సిలర్లతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులకు తెలంగాణ ఉద్యమకారులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ముఖ్యంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గుండారపు సంపత్ కుమార్‌ను నాయకులు అభినందించారు. అనంతరం జిన్నారం మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన బోనాల ఉత్సవాలు, తొట్టెల కార్యక్రమంలో కూడా ఆదర్శ్ రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వెంకటేష్ గౌడ్, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మండల స్థాయిలో 'ప్రజావాణి' కార్యక్రమం




**ఆత్మకూరు(ఎం),క్రైమ్ మిర్రర్, ఆగస్టు06:** ప్రజల సమస్యల పరిష్కార వ్యవస్థను మరింత పారదర్శకంగా, వేగవంతంగా ప్రజలకు చేరువ చేసేందుకు 'ప్రజావాణి' కార్యక్రమాన్ని మండల స్థాయికి విస్తరిస్తూ ఉత్తర్వులు (జి.ఓ.ఎంఎస్ నెం:4, తేదీ: 04.08.2026) జారీ చేసింది. ప్రతి వారం సోమవారం ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపిడిఓ) కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబడుతుంది. నోడల్ అధికారిగా: ఈ కార్యక్రమానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపీడీఓ) నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు. మండల స్థాయి ప్రజావాణిలో పాల్గొను అధికారుల హాజరు: తహసీల్దార్, ఎంపీఓ, మండల వ్యవసాయ అధికారి, ఎంఈఓ, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య అధికారి, పోలీస్ మరియు ఇతర మండల స్థాయి శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించి, వెంటనే చర్యలు చేపడతారు. డిజిటల్ నమోదు (ప్రజావాణి పోర్టల్): మండల స్థాయిలో వచ్చే ప్రతి ఫిర్యాదును ఏకీకృత 'ప్రజావాణి పోర్టల్'లో నమోదు చేసి, ఫిర్యాదుదారునికి గ్రీవెన్స్ ఐడీతో కూడిన రసీదును అందిస్తారు. మంచి నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు."10" పని దినాలలో సమస్య పరిష్కారం కాకపోతే అధికారుల పైన ఐపిసి166 సెక్షన్ ప్రకారం దరఖాస్తుదారులచే కేసులు నమోదు చేయబడతాయి. ప్రతి పోలీస్ స్టేషన్లో ప్రత్యేక అధికారిని నియమిస్తాం , అని ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటన ఇవ్వగలిగితే "ప్రజా పాలనకు" సార్థకత లభిస్తుంది.

## తెలంగాణ రాష్ట్ర మలిదశ ఉద్యమ సిద్ధాంతకర్త జయశంకర్ సార్ కి ఘన నివాళులు

**ఆత్మకూరు(ఎం),క్రైమ్ మిర్రర్, ఆగస్టు06:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం గురువారం రోజు తెలంగాణ రాష్ట్ర మలి దశ ఉద్యమ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం ఆధ్వర్యంలో చైర్మన్ యాస లక్ష్మా రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీఈఓ యాస కిరణ్ రెడ్డి, పాలకమండలి సభ్యులు పోతగాని మల్లేశం, సుగురి హరిబాబు, శ్రీరాముల భావన ఋషి,పంతుల భూపాల్, గంధమల్ల నర్సయ్య,సిబ్బంది బిక్షపతి, నరేష్, పావని, తదితరులు పాల్గొన్నారు.



# మావోయిస్టు ప్రాంతంలో… 'మానవతా వైద్యం'

- ఆరోగ్యానికి అండగా నిలిచిన మహిళా వైద్యురాలు
- పేదల పాలిట దేవతగా నిలిచిన డాక్టర్ అనూష
- మారుమూల గ్రామాల్లో ఆరోగ్య విప్లవం సృష్టిస్తున్న డాక్టర్ అనూష
- సెలవు లేదు...సేవే ధ్యేయం..
- రోగుల పట్ల ఆమె చూపే ఆప్యాయతే ప్రత్యేకత : ప్రజల ప్రశంస

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం అజాంనగర్ గ్రామంలో ప్రభుత్వ వైద్యాధికారిణి డాక్టర్ అనూష అందిస్తున్న వైద్య సేవలు ప్రజల మన్ననలు పొందుతున్నాయి. మారుమూల గ్రామాల్లో నివసించే ప్రజలకు నాణ్యమైన వైద్యం అందిస్తూ, ఆరోగ్య పరిరక్షణలో విశేష కృషి చేస్తున్నారు. ముఖ్యంగా మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో విధులు నిర్వహిస్తూ ప్రజలకు ధైర్యాన్ని, ఆరోగ్య భరోసాను కల్పిస్తున్నారు.






**మారుమూల గ్రామాలకు నాణ్యమైన వైద్యం**

అజాంనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రతి రోగికి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి, సరైన చికిత్స అందిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందిస్తూ రోగుల ప్రాణాలను కాపాడేందుకు కృషి చేస్తున్నారు. వైద్య సేవల కోసం పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే మెరుగైన సేవలు అందిస్తున్నారు.

**పేదలకు అండగా డాక్టర్ అనూష**



ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల పరిస్థితిని అర్థం చేసుకుని వారికి ప్రత్యేక శ్రద్ధతో వైద్యం అందిస్తున్నారు. అవసరమైన మందులు, ఆరోగ్య సూచనలు అందిస్తూ పేద ప్రజలకు అండగా నిలుస్తున్నారు. దీంతో స్థానిక ప్రజలు ఆమె సేవలను అభినందిస్తున్నారు.

**సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు**

వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, వైరల్ ఫీవర్, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పరిశుభ్రత, దోమల నివారణ, స్వచ్ఛమైన తాగునీటి వినియోగంపై ప్రజలకు సూచనలు చేస్తున్నారు.

**అనునిత్యం ప్రజలకు అందుబాటులో సేవలు**

విధి సమయాలకు పరిమితం కాకుండా అవసరమైతే ఎప్పుడైనా రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా సెలవు రోజుల్లో కూడా అవసరమైనప్పుడు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నారు.

**ఒక్కరోజు సెలవు లేకుండా సేవాభావం**

వైద్య వృత్తిని ఉద్యోగంగా కాకుండా సేవగా భావిస్తూ నిరంతరం విధులు నిర్వహిస్తున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రతిరోజూ ఆసుపత్రిలో అందుబాటులో ఉండి చికిత్స అందిస్తున్నారు.

**మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో సేవలు**

మావోయిస్టు ప్రభావిత ప్రాంతంగా పేరున్న అజాంనగర్ పరిసర ప్రాంతాల్లో విధులు నిర్వహించడం సవాలుతో కూడుకున్నప్పటికీ, ఎలాంటి వెనుకంజ వేయకుండా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు. గ్రామీణ ప్రజలకు ఆరోగ్య భరోసా కల్పించడంలో ఆమె పాత్ర విశేషంగా నిలుస్తోంది.

**చుట్టుపక్కల గ్రామాల ప్రజల హర్షం**

అజాంనగర్‌తో పాటు పరిసర గ్రామాల ప్రజలు కూడా డాక్టర్ అనూష సేవలను ప్రశంసిస్తున్నారు. సమయానికి చికిత్స, రోగులతో ఆప్యాయంగా వ్యవహరించడం, నాణ్యమైన వైద్యం అందించడం వల్ల ఆమెపై ప్రజలకు విశ్వాసం పెరిగిందని గ్రామస్తులు చెబుతున్నారు.

**ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా సేవలు**

ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య సేవలను ప్రతి ఒక్కరికీ చేరవేయాలనే లక్ష్యంతో డాక్టర్ అనూష నిరంతరం కృషి చేస్తున్నారు. మారుమూల గ్రామాల్లో వైద్య సేవలు మరింత మెరుగుపడేందుకు ఆమె చేస్తున్న సేవలు ఆదర్శంగా నిలుస్తున్నాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## తిరుమలాపూర్ లో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు...!

**జగిత్యాల జిల్లా బ్యూరో (క్రైమ్ మిర్రర్):** గొల్లపల్లి మండలం తిరుమలాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో బుధవారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో శ్రీమంతాలు మరియు అన్నప్రాసన కార్యక్రమాలు చేపట్టారు. ప్రోగ్రాములో భాగంగా సూపర్వైజర్ జానకి మాట్లాడుతూ.. పుట్టిన గంటలోపు ముర్రుపాలు పట్టించాలని, ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. తల్లిపాలలో పిల్లలకు కావలసిన పోషకాలతో పాటు ఎ, బి, సి, డి విటమిన్లు, ఇమ్యునో గ్లోబల్స్ పుష్కలంగా ఉంటాయని తెలిపారు. అంగన్వాడి టీచర్లు లాల్ని, హరిత, రజిత మరియు ఆశా కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రత్యేక కృషి చేశారు. వీరి సేవలు అభినందనీయం. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాషా అంజలి, ఉపసర్పంచ్ మస్కమ్ అంజనేయులు, వార్డ్ మెంబర్ నరేష్, గర్భిణీలు, బాలింతలు, తల్లులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.



# క్రీడలకు ప్రోత్సాహం.. విద్యకు ప్రాధాన్యం.. పర్యావరణానికి భరోసా

### ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** కల్వకుర్తి పట్టణంలో అభివృద్ధి, విద్యా, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన పలు కార్యక్రమాల్లో గురువారం కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు మరింత చేరువయ్యేలా కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. మొదటగా సుమారు రూ.1.30 కోట్ల వ్యయంతో నిర్మించనున్న మినీ స్టేడియం నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు అత్యాధునిక మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అనంతరం మహాత్మా జ్యోతిరావు పూలే బాలుర ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు ఉచిత యూనిఫాంలను పంపిణీ చేశారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని విద్యతో పాటు క్రమశిక్షణ, విలువలను అలవర్చుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలను అన్ని విధాలుగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తదుపరి మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, క్రీడాకారులు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


# సేవకు సత్కారం.. యశోత్సవ్‌లో ఆమనగల్ లయన్స్ క్లబ్‌కు అవార్డులు




**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320ొూ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని లయన్స్ భవన్‌లో నిర్వహించిన "యశోత్సవ్" జిల్లా అవార్డుల వేడుకలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ విశేష ప్రతిభ కనబరిచి అవార్డుల పంట పండించింది. క్లబ్‌కు మొత్తం 15 ప్రతిష్ఠాత్మక జిల్లా అవార్డులు, 3 ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ అవార్డులు లభించగా, పీడీజీ లయన్ జి. చెన్నకిషన్ రెడ్డికి లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డు ప్రదానం చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని క్లబ్ పీఆర్‌వో లయన్ పాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ డా. మహేంద్రకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్‌ను ఉత్తమ క్లబ్‌గా ఎంపిక చేశారు. అలాగే ఉత్తమ అధ్యక్షుడిగా లయన్ కె. గోవర్ధన్ రెడ్డి, ఉత్తమ కార్యదర్శిగా లయన్ గంప శ్రీను, ఉత్తమ కోశాధికారిగా లయన్ గంగుల శ్రీనివాస్ రెడ్డి, ఉత్తమ పీఆర్‌వోగా లయన్ పాషా అవార్డులు అందుకున్నారు. అదేవిధంగా, లయన్ సందడి నరేందర్ రెడ్డి, లయన్ డా. దామోదర్ రెడ్డిలకు అచీవ్మెంట్ అవార్డులు, లయన్ వీరబొమ్మ భిక్షపతి, లయన్ జూలూరి రమేష్, లయన్ పి. అంజిరెడ్డిలకు ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ అవార్డులు లభించాయి. లయన్ ఎస్. జనార్ధన్ రెడ్డి ఉత్తమ రీజియన్ చైర్మన్‌గా, లయన్ జూలూరి లింగయ్య ఉత్తమ జోన్ చైర్మన్‌గా గుర్తింపు పొందారు.ద సేవా కార్యక్రమాల విభాగంలో బెస్ట్ మీల్స్ ఆన్ వీల్స్, ఉత్తమ పర్మనెంట్ ప్రాజెక్ట్ (స్కిల్ డెవలప్మెంట్ సెంటర్), ఉత్తమ సైన్స్ ఎగ్జిబిషన్, ఉత్తమ హెల్త్ క్యాంప్స్, ఉత్తమ డయాబెటిస్ గుర్తింపు కార్యక్రమం, ఉత్తమ కంటి పరీక్షల నిర్వహణ, ఉత్తమ డయాలసిస్ సపోర్ట్ ప్రోగ్రామ్, ఉత్తమ రక్తదాన శిబిరం నిర్వహణ వంటి విభాగాల్లోనూ క్లబ్ అవార్డులు దక్కించుకుంది. 2025--26 సంవత్సరంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ నిర్వహించిన సేవా కార్యక్రమాలు విశేష ప్రశంసలు అందుకున్నాయి. ఈ కాలంలో 120 డయాలసిస్, డయాబెటిస్ క్యాంపులు, 3 మెగా హెల్త్ క్యాంపులు, 10 మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమాలు, 44 కంటి వైద్య శిబిరాలు, 4 శాశ్వత ప్రాజెక్టులు, 10 అన్నదాన కార్యక్రమాలతో పాటు మొత్తం 474 సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు క్లబ్ అధ్యక్షుడు లయన్ కె. గోవర్ధన్ రెడ్డి తెలిపారు. ఈ అవార్డులు క్లబ్ సభ్యులు, లియోలు, వాలంటీర్లు, దాతలు, రక్తదాతలు, సేవా కార్యక్రమాలకు సహకరించిన ప్రతి ఒక్కరికీ దక్కిన గౌరవమని ఆయన పేర్కొన్నారు. ఈ విజయంతో సమాజ సేవలో మరింత ఉత్సాహంతో ముందుకు సాగుతామని పాస్ట్ మల్టిపుల్ చైర్మన్ లయన్ ఎస్. నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ ఆర్. సునీల్ కుమార్, 320ొూ గవర్నర్ లయన్ సురేష్ జగ్నాని, పీడీజీ లయన్ జి. చెన్నకిషన్ రెడ్డి, క్లబ్ అధ్యక్షుడు లయన్ కె. గోవర్ధన్ రెడ్డి, కార్యదర్శి లయన్ గంప శ్రీను, కోశాధికారి లయన్ గంగుల శ్రీనివాస్ రెడ్డి, లయన్ జనార్ధన్ రెడ్డి, లయన్ జూలూరి లింగయ్య, లయన్ జూలూరి రమేష్, లయన్ వీరబొమ్మ భిక్షపతి, లయన్ ఓంకారం, లయన్ బండెల రామచంద్ర రెడ్డి, లయన్ కె. రాంరెడ్డి, లయన్ విష్ణువాస్ రెడ్డి, లయన్ చంద్రశేఖర్, లయన్ చెగురి వెంకటేష్, లయన్ గంప వెంకటేష్, లయన్ సంపత్ కుమార్, లయన్ బిచ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలు

**చిట్యాల క్రైమ్ మిర్రర్ :**చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలో తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త తెలంగాణ ఉద్యమ నేత ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతిని వెలిమినేడు గ్రామపంచాయతీ పాలకవర్గం మరియు గ్రామ ప్రజల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో సర్పంచ్ బొంతల చంద్రారెడ్డి, ఉప సర్పంచ్ అంతటి స్వప్న సత్తయ్య గౌడ్, వార్డ్ మెంబర్స్ మంకాల లింగస్వామి, ఆరూరి సునీత రవి, చింతకింది వెంకటేష్ , పంచాయతీ సెక్రెటరీ తాటికొండ లింగస్వామి , కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు సత్తిరెడ్డి ,సింగిల్ విండో వైస్ చైర్మన్ బొంతల అంజి రెడ్డి , కాంగ్రెస్ పార్టీ మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు చీమల వీరేశం , కిసాన్ మోర్చా జిల్లా మాజీ ఉపాధ్యక్షులు వెల్ది రాఘవరెడ్డి , సిపిఎం పార్టీ కార్యదర్శి పంది నరేష్ , నాయకులు కర్నాటి అంజి రెడ్డి , చింతకాయల శివకృష్ణ , చిర్రగోని నరసింహ , వరికుప్పల సుధాకర్ , పాల్గొనడం జరిగింది






# అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తాం

### -- సర్పంచ్ ఆవుల సుందర్

**చిట్యాల ఆగస్టు 06:** చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ సర్పంచ్ ఆవుల సుందర్ యాదవ్ ఆధ్వర్యంలో అనారోగ్యంతో బాధపడుతున్న లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద చెక్కులను అందజేయడంజరిగింది. లబ్ధిదారులు లోడు విష్ణుమూర్తి 35,000,మెట్టు దుర్గమ్మ 60,000ఎమ్మెల్యే వేముల వీరేశం కృషితో పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య సహాయం అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు శ్రీ దేశపాక మధు, శ్రీమతి నందిపాటి పార్వతమ్మ,కాంగ్రెస్ పార్టీ నాయకులు వలిగొండ సత్యనారాయణ, మెట్టు వెంకటేశం, వలిగొండ సోమయ్య, మెట్టు నాగశంకర్, దేశపాక శ్రావణ్, రుద్రారపు శంకరయ్య, పొలిమేర పరమేష్, పొలిమేర శంకర్ బాబు, నందిపాటి ప్రకాష్, అన్నెపు కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# సన్నాలు సాగు చేసే వరి రైతులు..! బోనస్ పొందాలంటే తప్పనిసరిగా ఆన్‌లైన్ చేసుకోవాలి

### ప్రభుత్వం ఎంపిక చేసిన 7 సన్న వరి రకాల సాగుదారులకు వ్యవసాయ శాఖ సూచన

**ఆత్మకూరు(ఎం),క్రైమ్ మిర్రర్, ఆగస్టు06:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం గురువారం రోజు ఏఈఓ రైతులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సన్న వరి సాగును ప్రోత్సహించేందుకు ఎంపిక చేసిన 7 సన్న వరి రకాల ధాన్యానికి కొనుగోలు సమయంలో క్వింటాలుకు రూ.500 బోనస్ అందజేయనున్న నేపథ్యంలో, సంబంధిత రైతులు తప్పనిసరిగా విత్తనాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి ఎం. అశోక్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంపిక చేసిన బీపీటీ-5204, ఆర్ఎన్ఆర్-15048 (తెలంగాణ సోనా), హెచ్ఎమ్‌టీ-సోనా, సిద్ధి, కేఎన్ఎమ్-1638, కేఎన్ఎమ్-7715, జైశ్రీరాం సన్న వరి రకాల సాగు చేస్తున్న రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన డీలర్ వద్దకు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్‌తో వెళ్లి వెంటనే ఆన్‌లైన్ నమోదు చేయించుకోవాలని కోరారు.ఒక వేళ డీలర్ వద్ద నుంచి విత్తనాలు కొనుగోలు చేయకుండ సొంత విత్తనంతో సాగు చేస్తున్న రైతులు స్వీయ ధ్రువీకరణ పత్రాన్ని సంబంధిత రైతు వేదికలో సమర్పించి నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం రైతులు తమ సమీప రైతు వేదికను సంప్రదించాలని ఆయన కోరారు.





## అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వార్షికోత్సవ కార్యక్రమం

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామం పరిధిలోని మొదటి అంగన్వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ సునీత ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన గ్రామ సర్పంచి సాగర్ల భాను శ్రీ మాట్లాడుతూ తల్లిపాల వారోత్సవా వాళ్లు ప్రతి సంవత్సరము అంగన్వాడి కేంద్రాలలో జరుపుకుంటారు గర్భవతులకు బాలింతలను ఉద్దేశించి పుట్టిన బిడ్డకు పుట్టిన గంటలోపే ముర్రుపాలు పసుపు రంగులో వచ్చే పాలను బిడ్డకు పట్టించాలి ఆ పాలు బిడ్డకు శ్రేష్టమైనవి బిడ్డకు వ్యాధి నిర్వహించుకునే శక్తిని ఇస్తుంది ఆరు నెలల వరకు తల్లిపాలు ఇస్తూ అదున అదనపుహారం అందించాలి బిడ్డకు రెండు సంవత్సరాల వరకు తల్లిపాలను కొనసాగిస్తుండాలి ఆరు నెలలు నిండిన పాపలకు అన్న ప్రసన్న కార్యక్రమాన్ని కూడా నిర్వహించడం తల్లిపాల ప్రాముఖ్యత గురించి గర్భిణీ స్త్రీలకు బాలింతలకు అందరికీ అవగాహన కల్పించారు ఇందులో భాగంగా 6 నెలల నిండిన పాపలకు అన్న ప్రసన్న కార్యక్రమ నిర్వహించడం జరిగినది. అంగన్వాడీ కేంద్రంలో బాలామృతం ని సద్వినియోగం చేసుకోవాలని ప్రతి బిడ్డ తల్లికి వివరించడం జరిగింది ఈ కార్యక్రమంలో వార్డు మెంబెర్ హరి ప్రసాద్ ,అంగన్వాడి టీచర్ అంజమ్మ ,లలిత బాలింతలు గర్భిణీ స్త్రీలు తల్లిదండ్రులు తదితరులు పాల్గొనడం జరిగింది

## ఆచార్య జయశంకర్ సార్ కి నివాళులర్పించిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**ఆత్మకూరు(ఎం),క్రైమ్ మిర్రర్, ఆగస్టు 06:** ఆచార్య జయశంకర్ సార్ జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జయశంకర్ సార్ ఆశయాలను సాధించాలని, ఆరు దశాబ్దాల తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి ప్రధాతగా కొనియాడారు. జీవితాంతం స్వరాష్ట్ర సాధన కోసం తప్పించిన తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్ సార్ కి ఘనంగా నివాళులర్పించారు.



# జయశంకర్ సార్‌కు ఎల్‌బీనగర్‌లో ఘన నివాళులు అర్పించిన ఎం ఎల్ ఏ సుధీర్ రెడ్డి

**క్రైమ్ మిర్రర్,ఎల్‌బీనగర్,ఆగస్టు 06:** తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రముఖ విద్యావేత్త, ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి మేధోబలంగా నిలిచిన ఆచార్య ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతి సందర్భంగా ఎల్‌బీనగర్‌లోని ఆయన విగ్రహానికి ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ సార్ జీవితాంతం అంకితభావంతో కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గం భావితరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణ కోసం జయశంకర్ సార్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన అందించిన మేధోపరమైన మార్గదర్శకత్వం, త్యాగం, నిబద్ధత ఎప్పటికీ మరువలేనివని ఎమ్మెల్యే తెలిపారు. జయశంకర్ సార్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్



కొప్పుల విఠల్ రెడ్డి, అందోజు సత్యంచారి, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పాల్గొని జయశంకర్ సార్‌కు నివాళులు అర్పించారు.

## కొత్తపేటలో వర్షాల ప్రభావం పరిశీలించిన మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్

**క్రైమ్ మిర్రర్, ఎల్బీనగర్, ఆగస్టు 6:** ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో కొత్తపేట డివిజన్ పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్ ప్రాంతంలో దెబ్బతిన్న రహదారులు, తెరిచి ఉన్న మ్యాన్‌హోల్స్, వర్షపు నీటి నిల్వలు తదితర సమస్యలను కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రానున్న బోనాల పండుగ సందర్భంగా భక్తులు, స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు తెలిపారు. అనంతరం వాటర్ వర్క్స్ అధికారులతో మాట్లాడిన ఆయన, ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్స్‌కు తక్షణ రక్షణ చర్యలు చేపట్టడం, నిల్వ ఉన్న వర్షపు నీటిని తొలగించడం, వరద కారణంగా మూసుకుపోయిన మ్యాన్‌హోల్స్‌ను వెంటనే శుభ్రపరచడం వంటి పనులను అత్యవసరంగా పూర్తి చేయాలని కోరారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ వేగంగా సమస్యలను



పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో కొత్తపేట డివిజన్ అధ్యక్షుడు మంచి రాజేష్ కుమార్, సీనియర్ నాయకుడు వెంకట్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు కిషన్, నగేష్, బద్రి లింగస్వామి, ధనరాజు, బాలు, బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనపై పోలీసుల కొరడా..!!

- మహదేవ్‌పూర్‌లో విస్తృత తనిఖీలు
- నిబంధనలు అతిక్రమించిన వాహనాలపై చర్యలు
- సురక్షిత ప్రయాణమే ప్రతి కుటుంబానికి నిజమైన రక్షణ : ఎస్ఐ

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనల పట్ల బాధ్యతాయుతమైన అవగాహన పెంపొందించేందుకు మహదేవ్‌పూర్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. సురక్షితంగా చేరుకోండి కార్యక్రమంలో భాగంగా మహదేవ్‌పూర్ కేంద్రంలో విస్తృత స్థాయిలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలను కాటారం డీఎస్పీ సూర్యనారాయణ పర్యవేక్షణలో, మహదేవ్‌పూర్ సీఐ వెంకటే, ఎస్ఐలు ఎం. సాంబమూర్తి, రమేష్, మోటారు వాహనాల తనిఖీ అధికారి సుందర్ లాల్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది నిర్వహించారు. తనిఖీల సందర్భంగా వాహనదారులకు రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తూ, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, బీమా, కాలుష్య నియంత్రణ ధ్రువీకరణ పత్రాలు ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవాలని సూచించారు. అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం వంటి చర్యలు ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తాయని వివరించారు. తనిఖీల్లో పత్రాలు సక్రమంగా లేని 9 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకుని తదుపరి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఎం.



సాంబమూర్తి మాట్లాడుతూ, ట్రాఫిక్ నిబంధనలు శిక్షల కోసం కాదు ప్రాణాలను కాపాడేందుకు రూపొందించినవి. ప్రతి ఒక్కరూ వాటిని పాటించి, సురక్షితంగా ఇంటికి చేరుకోవడం ప్రతి కుటుంబం పట్ల ఉన్న బాధ్యత" అని అన్నారు. ఇలాంటి ప్రత్యేక తనిఖీలు జిల్లాలోని ప్రధాన కూడళ్లు, రహదారులపై నిరంతరం కొనసాగుతాయని, వాహనదారులు నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని మహదేవ్‌పూర్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# చెంచు గిరిజనులకు ఆధార్ నమోదు వేగవంతం చేయాలి

**ఆగస్టు 15 వరకు నివాస ధ్రువీకరణ పత్రాలను చెంచులకు జారీ చేయాలి**

**జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**





**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని లింగాల, బల్మూర్, అమ్రాబాద్, పదర, అచ్చంపేట మండలాల్లో నివసిస్తున్న చెంచు గిరిజన కుటుంబాల పరిస్థితులు, చిన్నారుల ఆధార్ నమోదు, విద్య, ఆరోగ్యం, పోషకాహారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై శాఖల వారీగా సమీక్షించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో గురువారం ఐటీడీఏ, అటవీ, గిరిజన, రెవెన్యూ, విద్య, వైద్య ఆరోగ్య శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. నల్లమల్ల అటవీ ప్రాంతంలోని చెంచు గిరిజన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందాలంటే ప్రతి ఒక్కరికీ ఆధార్ కార్డు తప్పనిసరిగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా చిన్నారుల ఆధార్ నమోదు ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల ఐటీడీఏ నిర్వహించిన ప్రత్యేక సర్వేలో అచ్చంపేట నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 760 మంది చెంచు గిరిజన చిన్నారులకు ఆధార్ కార్డులు లేవని గుర్తించిన నేపథ్యంలో, వారికి అత్యవసరంగా ఆధార్ నమోదు చేపట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఆధార్ కార్డు కేవలం గుర్తింపు పత్రం మాత్రమే కాదని, విద్య, స్కాలర్‌షిప్‌లు, వైద్య సేవలు, బ్యాంకింగ్, రేషన్, సామాజిక భద్రత, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు కీలకమని కలెక్టర్ వివరించారు. ఒక్క చిన్నారి కూడా ఆధార్ లేకుండా మిగలకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఐటీడీఏ అధికారులు ఆధార్ లేని పిల్లల పూర్తి జాబితాను గ్రామాల వారీగా సిద్ధం చేసి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు, వైద్య, విద్య, అటవీ శాఖల అధికారులు సమన్వయంతో నిర్ణీత గడువులోపు నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. మారుమూల అటవీ ప్రాంతాల్లోని చెంచు తండాలు, గూడెలకు అధికారులు స్వయంగా వెళ్లి ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహించాలని, అవసరమైతే మొబైల్ ఆధార్ కిట్లను వినియోగించి గ్రామాల్లోనే నమోదు చేపట్టాలని ఆదేశించారు. జనన ధ్రువీకరణ పత్రాలు, నివాస ధ్రువీకరణ పత్రాలు, కుటుంబ వివరాల వంటి అవసరమైన పత్రాల జారీ విషయంలో రెవెన్యూ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఆరోగ్య శాఖ జనన నమోదుకు సంబంధించిన వివరాలను సమన్వయం చేయాలని, విద్యాశాఖ పాఠశాలల విద్యార్థుల వివరాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ఆధార్ కార్డులు లేని చెంచు కుటుంబాలకు ముందుగా నివాస ధ్రువీకరణ పత్రాలు జారీ చేసి, అనంతరం ఆధార్ నమోదు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అమ్రాబాద్, పదర, లింగాల, అచ్చంపేట, బల్మూర్, కొల్లాపూర్ ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించి ఈ నెలాఖరు నాటికి చెంచులందరికీ ఆధార్ కార్డులు జారీ చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆగస్టు 15 నాటికి నివాస ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని లక్ష్యంగా పెట్టుకోవడంతో పాటు, ప్రత్యేక ఆధార్ కిట్ల ద్వారా ఏజెన్సీ ప్రాంతాల్లో నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆదేశించారు. ఈ సమీక్షలు అదనపు కలెక్టర్ దేవ సహాయం, డి.టి.డి.ఓ శ్రీ కోటాజి, డి ఆర్ డి ఓ. చిన్న ఓబులేసు, డీఈవో రమేష్ కుమార్, డిపిఓ, ఈ డి ఎం, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అమీన్‌పూర్--బంధంకొమ్ము రహదారికి మోక్షం ఎప్పుడు..?

**మంజూరైన పనులు ప్రారంభం కాక ప్రజలకు ఇబ్బందులు**

**గుంతల రహదారిపై నిత్యం ప్రమాదాల భయం..**

**వెంటనే పనులు ప్రారంభించాలని ప్రజల డిమాండ్**



**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 06:** వేగంగా అభివృద్ధి చెందుతున్న అమీన్‌పూర్ ప్రాంతంలో ప్రధాన రహదారుల దుస్థితి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. అమీన్‌పూర్--బంధంకొమ్ము ప్రధాన రహదారి భారీ గుంతలతో ప్రమాదకరంగా మారినా, ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ ఇప్పటివరకు అభివృద్ధి పనులు ప్రారంభం కాకపోవడంపై స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిపై ప్రతిరోజూ వేలాది మంది ఐటీ, ప్రైవేట్ ఉద్యోగులు, విద్యార్థులు, స్థానికులు రాకపోకలు సాగిస్తుంటారు. అమీన్‌పూర్, బంధంకొమ్ము, బీరంగూడ, కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడ, సుల్తాన్‌పూర్ ప్రాంతాల ప్రజలకు ఇదే ప్రధాన రహదారి కావడంతో ట్రాఫిక్ రద్దీ కూడా అధికంగా ఉంటుంది. ఇటీవల కురిసిన వర్షాలతో రహదారి మరింత దెబ్బతిని భారీ గుంతలు ఏర్పడటంతో ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. అత్యవసర సేవల వాహనాల రాకపోకలకూ తీవ్ర ఆటంకం ఏర్పడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో ఈ రహదారిపై తగిన వీధి దీపాలు లేకపోవడంతో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. చీకటిలో గుంతలు కనిపించక ప్రమాదాలు పెరుగుతున్నాయని, మహిళలు, విద్యార్థులు భయాందోళనల మధ్య ప్రయాణించాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. ఈ రహదారి అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ పనులు ఎందుకు ప్రారంభం కాలేదనే ప్రశ్న ప్రజల నుంచి వినిపిస్తోంది. అధికారులు, కాంట్రాక్టర్ల మధ్య సమన్వయ లోపమా, లేక పరిపాలనా జాప్యమా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వర్షాకాలం ముగిసేలోపు మంజూరైన పనులను ప్రారంభించి, అప్పటి వరకు గుంతలను తాత్కాలికంగా పూడ్చి సురక్షిత రాకపోకలు కల్పించాలని ప్రజలు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు. పనుల ప్రారంభానికి స్పష్టమైన గడువు ప్రకటించి, నాణ్యమైన రహదారిని త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.





## జీఎం కార్యాలయంలో ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు

**మందమర్రి టౌన్ ఆగస్టు 06 క్రైమ్ మిర్రర్:** తెలంగాణ సిద్ధాంతకర్త, కీర్తిశేషులు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను గురువారం మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించరని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ చేసిన కృషి, మార్గదర్శకత్వం ఎంతో గొప్పవి అన్నారు. ఆయన తన జీవితాంతం తెలంగాణ ఆత్మగౌరవం, హక్కుల కోసం శ్రమించారని పేర్కొన్నారు. తెలంగాణ భావజాలాన్ని ప్రతి ఒక్కరిలో రగిలించి, ఉద్యమానికి దిశానిర్దేశం చేసిన గొప్ప మహనీయుడు అని ఆయన జయంతి వేడుకలను మన మందమర్రి ఏరియాలో నిర్వహించుకోవడం ఎంతో సంతోషంగా, గర్వకారణంగా ఉంది అని పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను, ఇక్కడి వనరుల దోపిడీని గాంభీర్యంతో, శాస్త్రీయ దృక్పథంతో ప్రజలకు వివరించడంలో వహించిన పాత్ర చిరస్మరణీయమని అన్నారు. విద్యార్థి దశ నుంచే ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాటం ప్రారంభించి, చివరి శ్వాస వరకు తెలంగాణ ధ్యేయంగా బతికిన ఆయన జీవితం అందరికీ మార్గదర్శకమని తెలిపారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయుసి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, డీజీఎం పర్సనల్ సిహెచ్. అశోక్, సీనియర్ పిఓ సత్యనారాయణ, మందమర్రి ఏరియా ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

## అబ్బాపూర్‌లో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు.. తల్లులకు అవగాహన!

**జగిత్యాల జిల్లా బ్యూరో క్రైమ్ మిర్రర్:** గొల్లపల్లి మండలం ఇబ్రహీంనగర్ సెక్టార్ పరిధిలోని అబ్బాపూర్ గ్రామంలో బుధవారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ జ్యోతి మాట్లాడుతూ.. పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని, ఆరు నెలల వయసు వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. అలాగే రెండేళ్ల వయసు పూర్తయ్యే వరకు అనుబంధ పోషకాహారంతో పాటు తల్లిపాలు కొనసాగించాలని తల్లులకు వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గర్భిణీలు, బాలింతలకు టేక్ హోమ్ రేషన్ (ఎ=) పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి అంగన్వాడి టీచర్ శ్యామలత, ఆశా కార్యకర్త, గర్భిణీలు, బాలింతలు, తల్లులు మరియు పిల్లలు పాల్గొన్నారు.





# పిల్లిగుండ్ల సర్పంచ్ స్వాతి కాంత్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బొల్లారం వెంకట్ రెడ్డి

**శంకర్పల్లి మండల యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ బొల్లారం ప్రశాంత్ రెడ్డి**

**క్రైమ్ మిర్రర్ -- శంకర్‌పల్లి:** పిల్లిగుండ్ల గ్రామ సర్పంచ్ స్వాతి కాంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని శంకర్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొల్లారం వెంకట్ రెడ్డి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బొల్లారం వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, కాంత్ రెడ్డి ప్రజలకు మరింత సేవ చేస్తూ రాజకీయంగా ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ప్రజల ఆశీస్సులతో భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు చేపట్టి ప్రజాసేవలో విశిష్ట గుర్తింపు పొందాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కాంత్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, విజయాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రౌడీ, హిస్టరీ షీటర్లపై నిరంతర నిఘా ఉంచాలి: జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్...!

**శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు**

**జిల్లా పోలీస్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహణ.**

**జగిత్యాల జిల్లా బ్యూరో (క్రైమ్ మిర్రర్):** జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ఎలాంటి విఘాతం కలగకుండా రౌడీ షీట్లు, హిస్టరీ షీట్లలో ఉన్న వ్యక్తులపై నిరంతర నిఘా కొనసాగించాలని ఎస్పీ అశోక్ కుమార్, పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో రౌడీ, హిస్టరీ, సస్పెక్ట్ షీట్ల నిర్వహణ మరియు నేరస్తులపై తీసుకుంటున్న చర్యలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలని సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అవసరమైన సందర్భాల్లో బైండోవర్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. పాత నేరస్థులు తిరిగి నేరాలకు పాల్పడకుండా పర్యవేక్షణ కొనసాగించాలని, ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీ షీటర్ల వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని స్పష్టం చేశారు. అనుమానాస్పద వ్యక్తులు మరియు అల్లర్లలో ప్రమేయం ఉన్నవారిని ప్రతి నెలా పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వివరాలు సేకరించాలని అన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని, ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమీక్షా సమావేశంలో డీఎస్పీలు పురుషోత్తం రెడ్డి, రాములు, రవికుమార్, సీఐలు కరుణాకర్, సుధాకర్, రామ్ నరసింహారెడ్డి, రాజ్‌కుమార్, సురేష్‌బాబు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# జయశంకర్ ఆశయాలు చిరస్థాయిగా నిలవాలి: తహాశీల్దార్

**తహాశీల్దార్ కార్యాలయంలో ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు**

**ఉద్యమ చరిత్రలో చెరగని ముద్ర వేసిన ప్రొఫెసర్ జయశంకర్**

**తెలంగాణ ఉద్యమానికి మార్గనిర్దేశం : లక్ష్మీరాజయ్య**



**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమకారుడు, విద్యావేత్త ఆచార్య ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి సందర్భంగా గురువారం భూపాలపల్లి తహాశీల్దార్ కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహాశీల్దార్ లక్ష్మీరాజయ్య ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అధికారులు, సిబ్బంది కలిసి ఆయనకు నివాళులు అర్పించి, తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా తహాశీల్దార్ లక్ష్మీరాజయ్య మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆచార్య జయశంకర్ జీవితాంతం అహర్నిశలు శ్రమించారని అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను దేశవ్యాప్తంగా వినిపిస్తూ, ప్రత్యేక రాష్ట్ర అవసరాన్ని గణాంకాలు, పరిశోధనలు, చారిత్రక ఆధారాలతో నిరూపించిన మహనీయుడు జయశంకర్ అని కొనియాడారు. తెలంగాణ ఉద్యమానికి సిద్ధాంతపరమైన బలాన్ని అందించి, ఉద్యమాన్ని సరైన దిశగా నడిపించిన గొప్ప మేధావిగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. 1969 తెలంగాణ ఉద్యమంలోనే కాకుండా, అంతకుముందు జరిగిన నాన్-ముల్కీ ఉద్యమంలో కూడా ప్రొఫెసర్ జయశంకర్ చురుకైన పాత్ర పోషించారని తెలిపారు. తెలంగాణ ప్రజల హక్కుల కోసం, ప్రాంతీయ అసమానతల నిర్మూలన కోసం ఆయన నిరంతరం పోరాడారని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడడాన్ని ప్రత్యక్షంగా చూడాలనే కోరిక ఆయనకు ఎంతో ఉన్నప్పటికీ, రాష్ట్ర ఆవిర్భావానికి మూడేళ్ల ముందే 2011 జూన్ 21న ఆయన మరణించడం తెలంగాణ సమాజానికి తీరని లోటుగా మిగిలిందన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం ఆయన సేవలకు గుర్తింపుగా మన జిల్లాకు 'జయశంకర్ భూపాలపల్లి జిల్లా'గా పేరు పెట్టడం ప్రతి జిల్లా వాసికి గర్వకారణమని తహాశీల్దార్ పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహాశీల్దార్ అంజలి రెడ్డి, గిర్దావర్ రామస్వామి, జీపీఓలు, రెవెన్యూ శాఖ అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

# శంకర్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ 92వ జయంతి వేడుకలు ఘనంగా

**మున్సిపల్ చైర్పర్సన్ సాత ప్రవీణ్ కుమార్**






**క్రైమ్ మిర్రర్ -- శంకర్‌పల్లి:** తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ 92వ జయంతి సందర్భంగా శంకర్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఏ. యోగేష్, వైస్ చైర్‌పర్సన్ జూలకంటి శ్వేతా పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, ప్రొఫెసర్ జయశంకర్ సార్ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్నే అంకితం చేసిన మహనీయుడని అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప మేధావిగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు.జయశంకర్ సార్ ఆశయాలు, సిద్ధాంతాలు, విలువలు భావితరాలకు మార్గదర్శకంగా నిలవాలని, తెలంగాణ యువత ఆయన అడుగుజాడల్లో నడుస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ సాధనలో ఆయన చేసిన త్యాగాలు, సేవలు ఎప్పటికీ చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్ సార్‌కు ఘన నివాళులు అర్పించారు.

# బిల్లు అడిగాడని కుల దూషణ.. పోలీసులకు ఫిర్యాదు

**నర్సాపూర్, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 06:** ఇంటి నిర్మాణానికి తీసుకున్న స్టీల్, సిమెంట్ బిల్లు కోరగా తనపై దాడి చేసి కుల దూషణలకు పాల్పడ్డారని ఓ రైతు పోలీసులను ఆశ్రయించాడు. కూకుట్లపల్లి గ్రామానికి చెందిన నీరుడి భాగయ్య (44) గురువారం కౌడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తన ఇంటి నిర్మాణం కోసం గత ఏడాది అక్టోబర్‌లో కౌడిపల్లి గ్రామానికి చెందిన పోల నవీన్ వద్ద స్టీల్, సిమెంట్ కొనుగోలు చేసినట్లు తెలిపాడు. ఈ నెల 31న ఉదయం




బిల్లు ఇవ్వాలని, ఎంత మొత్తం చెల్లించాలో చెప్పాలని అడగగా నవీన్ ఆగ్రహానికి గురై తనపై దాడి చేశాడని ఆరోపించాడు. అంతేకాకుండా తనను కులం పేరుతో దూషిస్తూ అవమానించాడని, దీంతో తన ఆత్మగౌరవానికి భంగం కలిగిందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ ఘటనను గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ప్రత్యక్షంగా చూశాడని తెలిపాడు. ఈ ఘటనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితుడు పోలీసులను కోరాడు. పోలీసులు ఫిర్యాదు స్వీకరించి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

# అంతర్జాతీయ బ్రూస్ లీ కరాటే అవార్డు అందుకున్న రవీందర్ లంటూ యాదవ్

**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి:** కరాటే రంగంలో విశిష్ట సేవలు అందించినందుకు శంకర్‌పల్లి ప్రాంతానికి చెందిన ప్రముఖ కరాటే శిక్షకుడు రవీందర్ లాంటు యాదవ్ ప్రతిష్ఠాత్మక లి"ఇంటర్నేషనల్ మిస్టర్ బ్రూస్ లీ కరాటే అవార్డు -- 2026"లికు ఎంపికై అరుదైన గౌరవాన్ని అందుకున్నారు. భారతదేశంలోని డ్రీమ్ వరల్డ్ మార్షల్ ఆర్ట్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన 2వ అంతర్జాతీయ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ -- 2026 సందర్భంగా ఈ అవార్డును ప్రదానం చేశారు. కరాటే శిక్షణ, క్రీడాకారుల తీర్చిదిద్దడం, మార్షల్ ఆర్ట్స్ అభివృద్ధికి చేసిన విశేష కృషిని గుర్తించి ఈ అంతర్జాతీయ పురస్కారానికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా రవీందర్ లాంటు యాదవ్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ప్రోత్సహించిన గురువులు, శిష్యులు, కుటుంబ సభ్యులు, మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మరింత మంది యువతకు కరాటే శిక్షణ అందిస్తూ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ ప్రతిష్ఠాత్మక






అంతర్జాతీయ అవార్డు అందుకోవడంతో శంకర్‌పల్లి ప్రాంత ప్రజలు, క్రీడాకారులు, శిష్యులు, అభిమానులు రవీందర్ లాంటు యాదవ్‌కు అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు.


# జర్నలిస్టుల సంక్షేమమే "టిడబ్ల్యూజెఎఫ్" ధ్యేయం

- జాతీయ కార్యవర్గ సభ్యుడు సుదర్శన్‌రెడ్డి
- పటాన్‌చెరు నియోజకవర్గ మూడవ మహాసభ విజయ వంతం
- జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు నిరంతర పోరాటం చేస్తాం
- నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక, జర్నలిస్టుల ఐక్యతకు పెద్దపీట
- హక్కుల సాధనకు సమిష్టి పోరాటం, జర్నలిస్టుల
- సంక్షేమమే టిడబ్ల్యూజెఎఫ్ లక్ష్యం
- పాత్రికేయుల సమస్యలపై విస్తృత చర్చ, కొత్త కమిటీపై సభ్యుల ఆశలు
- సంఘ బలోపేతానికి నాయకుల పిలుపు
- కష్టకాలంలో జర్నలిస్టులకు అండగా టిడబ్ల్యూజెఎఫ్ ఉంటుంది
- భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేసిన జిల్లా అధ్యక్షులు ఎల్గోయి ప్రభాకర్






**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 06:** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజెఎఫ్) జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తోందని టిడబ్ల్యూజెఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు. కష్టకాలంలో ప్రతి జర్నలిస్టుకు అండగా నిలుస్తూ, సంక్షేమ పథకాలు అందే వరకు సంఘం నిరంతరం పోరాటం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. గురువారం పటాన్‌చెరులోని ఐబీ అతిథి గృహంలో నిర్వహించిన టిడబ్ల్యూజెఎఫ్ పటాన్‌చెరు నియోజకవర్గ మూడవ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆయనతో పాటు రాష్ట్ర నాయకులు మేకల కృష్ణయ్య, ప్రభు, జిల్లా అధ్యక్షుడు ఎల్గోయి ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సురేందర్ హాజరై జర్నలిస్టుల ఐక్యత, హక్కుల సాధన, సంక్షేమ కార్యక్రమాల అమలుపై చర్చించారు. ఈ సందర్భంగా పటాన్‌చెరు నియోజకవర్గ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బాదిని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కొత్తకొండ సత్యం ఎన్నికయ్యారు. గౌరవ సలహాదారులుగా వాసుదేవ్, శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా రవీందర్ చారి, నరసింహారెడ్డి, సంగమేశ్వర్, సహాయ కార్యదర్శులుగా గిరి, ప్రసాద్, కృష్ణగౌడ్, రాము, కోశాధికారిగా భానుచందర్, ప్రచార కార్యదర్శిగా ముద్దంగుల ఎల్లయ్య, ఈసీ కమిటీ సభ్యులుగా గణేష్, రాజు, రాజశేఖర్, విజయ్, రమేష్‌లను ఎన్నుకున్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు ఎల్గోయి ప్రభాకర్ మాట్లాడుతూ..మహాసభలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, వృత్తిపరమైన సవాళ్లు, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించామని చెప్పారు. పాత్రికేయుల హక్కుల సాధనకు ఐక్యంగా ముందుకు సాగాలని, సంఘ బలోపేతంతోనే జర్నలిస్టుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన తను చేసిన సేవా కార్యక్రమాలు గుర్తు చేశారు. కరోన కాలంలో హైదరాబాద్ నుండి జహీరాబాద్, నారాయణఖేడ్ ప్రాంతాలకు అనేక మంది వెళుతుంటే ఆ పాదచారులు సేవలు చేశామని గుర్తు చేశారు. వారికి భోజనం నీరు అందించామని అన్నారు. జిల్లాలో నె కాకుండా ఇతర రాష్టాలలో ఉన్న తెలుగు వారికి కూడ టిడబ్ల్యూజెఎఫ్ ద్వార సహాయం అందించామని అన్నారు. కొంత మంది దాతల ద్వార జర్నలిస్టుల కుటుంబాలకు నిత్యావసర వస్తువులను కూడ అందించామని అన్నారు. టిడబ్ల్యూజెఎఫ్ లొ ఉన్న సభ్యులు కూడ సేవా గుణం కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. దాంతోనే టిడబ్ల్యూజెఎఫ్ ఉన్న జర్నలిస్టుల ఐక్యత వల్ల మనకు ఉన్న సమస్యల పై పోరాటం చెయ్యవచ్చని అన్నారు. అనంతరం ఈ సమావేశం పాల్గొన్న వారికి మెమోంటోలను అందించారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన జర్నలిస్టులు, సంఘ నాయకులు, కమిటీ సభ్యులు, సీనియర్ పాత్రికేయులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.



# ఫీజుల బకాయి.. ప్రభుత్వంపై బీజేపీ ఫైర్..!!

- పేద విద్యార్థులకు అండగా నిలవడమే బీజేపీ లక్ష్యం : సునీల్ రెడ్డి
- విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడొద్దు : రాంశెట్టి మనోజ్
- స్కాలర్‌షిప్‌లు వెంటనే మంజూరు చేయాలి : ఎం.ఆర్ యాదవ్

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన ఫీజుల బకాయి బీజేపీ లడాయి కార్యక్రమంలో భాగంగా మహాదేవపూర్ మండల కేంద్రంలో ఆందోళన నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షులు రాంశెట్టి మనోజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చల్ల నారాయణరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మహాదేవపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి బీజేపీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని వారు తెలిపారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం నిర్వీర్యమైందని ఆరోపించారు. ప్రభుత్వం బాధ్యతారాహిత్యంతో వ్యవహరిస్తూ లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ఇబ్బందుల్లోకి నెట్టిందని విమర్శించారు. "వన్ టైం సెటిల్‌మెంట్ పేరుతో ఇచ్చిన హామీలు అమలు కాలేదు. ఫీజు బకాయిల కారణంగా విద్యార్థులు సర్టిఫికెట్లు పొందలేక ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాలకు దూరమవుతున్నారు" అని అన్నారు. రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీజేపీ డిమాండ్ చేసింది. అలాగే ఫీజు బకాయిల కారణంగా నిలిచిపోయిన విద్యార్థుల సర్టిఫికెట్లను వెంటనే అందించాలని, 40 లక్షల మంది విద్యార్థుల చదువులు, భవిష్యత్తు దెబ్బతినకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరింది. భవిష్యత్తులో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోకుండా ప్రత్యేక చట్టం తీసుకురావాలని, నిరుపేద విద్యార్థులకు అత్యవసర ఆర్థిక సహాయం అందించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల భవిష్యత్తును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మంథని నియోజకవర్గ సీనియర్ నాయకులు సత్యప్రకాష్, మండల అధ్యక్షులు రాంశెట్టి మనోజ్, మాజీ అధ్యక్షులు సిరిపురం శ్రీమన్నారాయణ, ఓబీసీ మండల అధ్యక్షులు సాగర్ల రవీందర్, కిషన్ మోర్చా అధ్యక్షులు ఓడేటి బాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులు బల్ల శ్రావణ్ కుమార్, లింగంపల్లి వంశీధర్ రావు, మండల కార్యదర్శి ఎం.ఆర్ యాదవ్, కోశాధికారి పూర్ణచందర్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు లింగంపల్లి జోగేష్ తదితర నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.